ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

బుధవారం 9 జూలై 2025

జన ఔషధి కేంద్రాల మూసివేతపై హైకోర్టు అభ్యంతరం

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల ప్రాంగణంలో జన ఔషధి కేంద్రాలను మూసివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఏర్పాటు చేసిన జన ఔషధి కేంద్రాలను ఇటీవల రాష్ట్రప్రభుత్వం మూసివేయించింది. బెంగళూరు దక్షిణ ఎంపీ కార్యాలయం సిబ్బందితోపాటు, పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఆసుపత్రి ప్రాంగణంలోని జన ఔషధి కేంద్రాలను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు మూసివేయరాదని ఆదేశించారు.

యాదగిరి జిల్లా అధికారిగా హర్షల్ నారాయణ రావ్

● రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఏఎస్‌ల బదిలీ

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): అటల్ జనస్నేహి కేంద్రం ఎండీగా కొనసాగుతున్న భూయల్ హర్షల్ నారాయణరావ్‌ను యాదగిరి జిల్లా అధికారిగా నియమస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ అయ్యాయి. విజయనగర జిల్లా అధికారిగా ప్రస్తుతం దక్షిణకన్నడ జిల్లా పంచాయతీ సీఈఓ ఆనంద్‌ను నియమించారు. విజయనగర జిల్లా అధికారిగా ఉన్న భూబాలన్‌ను ఈ-పాలనా వ్యవహారాల కేంద్రం సీఈఓగాను, యాదగిరి జిల్లా అధికారి సుశీలను కల్యాణ కర్ణాటక రోడ్డురవాణా సంస్థ ఎండీగా బదిలీ చేశారు. జహీర్ నసీంను కలబురగి ప్రాంతీయ కమిషనర్‌గాను, పండవె రాహుల్ తుకారాంను కలబురగి పబ్లిక్ కన్‌స్ట్రక్షన్ అదనపు కమిషనర్‌గాను దినేశ్ శశిని, ఉత్తరకన్నడ జిల్లా పంచాయతీ సీఈఓగాను, ఈశ్వర్‌కుమార్‌ను రాయచూరు జడ్పీ సీఈఓగాను, శశిధర్ కురేరారను కేయూఐడీఎఫ్‌సీ జాయింట్ ఎండీగాను, డాక్టర్ ఆకాశ్ ఎస్‌ను బాగల్కోటె జడ్పీ సీఈఓగాను, అపర్ణ రమేశ్‌ను ఐసీడీఎస్ డైరెక్టర్‌గాను, నర్వార్ వినాయక్ కర్బాడిని దక్షిణకన్నడ జిల్లా సీఈఓగాను, యతీశ్‌ను బెంగళూర నగర జిల్లా పంచాయతీ సీఈఓగాను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రి శివరాజ్ తంగడిగె రాజీనామా చేయాలి

● మఠాల నిధుల్లోనూ కమీషన్ల కక్కుర్తి
● మితిమీరుతున్న మంత్రి అనుచరుల ఆగడాలు
: బీజేపీ ఎమ్మెల్సీ వైఎం సతీశ్

8

33 మార్కులకే పాస్!





● ఎస్ఎస్ఎల్‌సీలో మార్కులకు విద్యాశాఖ ప్రతిపాదన ● సీబీఎస్ఈ తరహాలో అవకాశం
● మొత్తం మార్కులు 625 నుంచి 600కు తగ్గింపు ● విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే..

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణతా మార్కులు తగ్గించాలని విద్యాశాఖ ప్రయత్నిస్తోంది. స్టేట్ సిలబస్‌కు అనుగుణంగా ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు భవిష్యత్తులో సీబీఎస్ఈ తరహాలోనే ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలను ఎదుర్కోనున్నారు. సీబీఎస్ఈ సిలబస్ చదివే విద్యార్థులకు 33శాతం మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులైనట్లుగా పరిగణిస్తారు. ప్రతి సబ్జెక్టుకు 20 ఇంటర్నల్ మార్కులు, 80 మార్కులకు రాత పరీక్షలు జరపనున్నారు. రెండింటికీ కలిపి 100కు 33 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులైనట్లు అవుతోంది. ఇదే తరహాలోనే స్టేట్ సిలబస్‌లోనూ అమలు చేసేందుకు కర్ణాటక పాఠశాల పరీక్ష, మౌల్యమాపన మండలి, ప్రభుత్వానికి ప్రస్తావనలు పంపింది. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో కన్నడతోపాటు ఫస్ట్ లాంగ్వేజ్‌కు 125 మార్కులకు, గణితం, సైన్స్, సోషియల్‌తోపాటు సెకండ్, అండ్ థర్డ్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు 100 మార్కులకు పరీక్షలు జరగనున్నాయి. ఇందులో ఫస్ట్ లాంగ్వేజ్‌కు 25, మిగిలిన సబ్జెక్టులకు 20 మార్కులు ఇంటర్నల్‌గా ఉంటాయి. సీబీఎస్ఈ తరహాలో ఒక సబ్జెక్టులో విద్యార్థి 20 మార్కులు పొందితే రాత పరీక్షలో 13 మార్కులు వచ్చినా ఉత్తీర్ణులైనట్లు అవుతుంది.

పరీక్షల్లో పెరిగిన అక్రమాలు..!

ప్రస్తుతం స్టేట్ సిలబస్ ప్రకారం 35శాతం మార్కులు రావాలనే నిబంధన ఉంది. ప్రతి సబ్జెక్టులోనూ 80 మార్కులకు రాత పరీక్ష ఉన్నా, 28 మార్కులు (35శాతం) పొందడం తప్పనిసరిగా ఉంది. సీబీఎస్ఈ విధానం అమలు చేస్తే విద్యార్థులకు రాత పరీక్షల్లో ఒత్తిడి తక్కువ కానుంది. అయితే అన్ని సబ్జెక్టులలోనూ ఇంటర్నల్ మార్కులతో కలిపి 33 మార్కులు సాధించాల్సి ఉంటుంది. అన్ని సబ్జెక్టులలోనూ 100కు వంద సాధించినా, ఒక సబ్జెక్టులలో 33కంటే తక్కువ వస్తే ఫెయిల్ అయినట్టు అవుతుంది. ఎస్ఎస్ఎల్‌సీలో అధికశాతం ఉత్తీర్ణత పొందేందుకు పలు జిల్లాల్లో అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. మాస్ కాపీయింగ్‌తోపాటు ప్రశ్నాపత్రం లీకేజీకి ఇవే కారణాలుగా ఉన్నాయి. 2024 నుంచి సీసీ కెమెరాలు, వెబ్‌క్యాస్టింగ్ అమలులోకి తేవడంతో ఫలితాలు గణనీయంగా తగ్గాయి. కన్నడతోపాటు ఎస్ఎస్ఎల్‌సీలో ఫస్ట్‌లాంగ్వేజ్ భాషా పరీక్షను 125 మార్కులకు బదులు 100కు తగ్గించదలిచారు. మొత్తంగా 625 మార్కులుగా ఉండే ప్రస్తుత పరీక్షలను 600కు తగ్గించనున్నారు. ప్రతి సబ్జెక్టులోనూ 20 మార్కులు ఇంటర్నల్, 80 మార్కులకు రాతపరీక్షలు ఉండనున్నాయి. 2026 మార్చి లేదా ఏప్రిల్‌లో జరిగే పరీక్షలలో కొత్త విధానం అమలు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకే అని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

పరిశీలిస్తున్నాం: మంత్రి మధు బంగారప్ప



ఇదే విషయమై ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప మాట్లాడుతూ పరీక్షామండలి ప్రస్తావనలు పంపిందని, ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరగాల్సి ఉందని, విద్యార్థులకు ఒత్తిడి తగ్గించడంతోపాటు సానుకూలం అయ్యేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా ప్రైవేట్ విద్యాసంస్థల పాలకమండలి అధ్యక్షుడు శశికుమార్ అభిప్రాయం మేరకు సెంట్రల్ పరీక్షల పద్ధతికి, స్టేట్ సిలబస్ పరీక్షలకు వ్యత్యాసం ఉందన్నారు. ఒకే విధానంతో పరీక్షలు జరిపితే విద్యార్థులలో పోటీతత్వం తగ్గుతుందన్నారు.

తమిళనాడు, ఏపీలో పోరాటం ఎందుకు చేయరు..?



● రైతులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు అవసరమా? ● నటుడు ప్రకాశ్‌రాజ్‌కు మంత్రి ఎంబీ పాటిల్ సూటి ప్రశ్న

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంలో అందరికీ పోరాటం చేసే హక్కు ఉందని, నా రాజకీయ జీవితమంతా పోరాటంతోనే సాగిందని కానీ బహుభాషా నటుడైన ప్రకాశ్‌రాజ్ ఎందుకు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో రైతుల తరపున పోరాటం చేయరని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ప్రశ్నించారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవనహళ్ళి పరిధిలో హైటెక్ డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌కు 1282 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని తీర్మానించామన్నారు. అక్కడి రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. వారిని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తామన్నారు. కానీ ప్రకాశ్‌రాజ్ వారికి మద్దతు ఇవ్వడమే కాకుండా పలు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రకాశ్‌రాజ్‌కు మాకంటే ఎక్కువ ఆంధ్రలో అభిమానులు ఉన్నారని, తమిళంలో కూడా నటించారని అభిమానులు కూడా ఉన్నారన్నారు. అక్కడి రైతుల తరపున ఎందుకు పోరాటం చేయరన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల కోసం కర్ణాటక సరిహద్దున ఉండే మడకశిర నుంచి పెనుగొండవరకు 10వేల ఎకరాలు స్వాధీనం చేసుకుని పరిశ్రమలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారన్నారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 45వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారని, విశాఖలో ఇన్ఫోసిస్, టీసీఎస్, కాగ్నిజెంట్, తదితర వంద కంపెనీలకు భూమి ఇచ్చారని, ప్రకాశ్‌రాజ్‌కు ఇది కనిపించదా..? అన్నారు. తమిళనాడులోని హోసూరు ప్రాంతం బెంగళూరుకు 50 కిలోమీటర్ల దూరంలో ఉందని, అక్కడ పరిశ్రమలతోపాటు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించేందుకు వేల ఎకరాలను స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. ఇటువంటివి ఎందుకు కనిపించవని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం కర్ణాటకను విస్మరించి, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లకు డిఫెన్స్ కారిడార్‌ను ప్రకటించిందని, బుధవారం కేంద్ర రక్షణమంత్రితో భేటీ అవుతామన్నారు. రైతులకు న్యాయం చేయడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో అన్నదాతను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. అందరికీ నచ్చజెప్పే భూస్వాధీనం చేసుకుంటామని, బలవంతంగా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని, ఏ వర్గానికీ అన్యాయం చేయడం తమ లక్ష్యం కాదన్నారు. త్వరలో రైతు నాయకులతో చర్చిస్తామన్నారు.

అమెరికా అధ్యక్షుడితో భేటీకి ఎంపీ తేజస్వి సూర్య ప్రయత్నం

● దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు
● ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే ఎద్దేవా



బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ రాజనీతి బృందంతో కలిసి అమెరికా వెళ్లిన బెంగళూరు యువ ఎంపీ తేజస్విసూర్య, ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రత్యేకంగా కలిసేందుకు ప్రయత్నించి అవమానం పాలయ్యారని ఐటీబీటీశాఖ మంత్రి ప్రియాంక ఖర్గే ఎద్దేవా చేశారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని స్క్రీన్‌షాట్ చేర్చి ఇది రాజనీతి ఉల్లంఘన కాదా..? అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం, విదేశీ వ్యవహారాల శాఖకు ఇందుకు సంబంధించిన సమాచారం ఉందా..? లేదా..? అని ప్రశ్నించారు. ఈ వ్యక్తి అధికారిక బృందంలో భాగస్వామి అయినపుడు ఇటువంటి అతిప్రయత్నాలను సమర్థిస్తున్నారా..? అన్నారు. ఎంపీ, కేంద్రప్రభుత్వం ఈ ఉల్లంఘనపట్ల ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పగలరా..? అన్నారు. అమెరికా అధ్యక్షుడు, పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచి బహిరంగంగానే ఆపరేషన్ సింధూరలో యుద్ధ విరామ కీర్తిని పొందారు. ఇది సున్నితమైన రాజకీయ గాసిప్ కాదని, భారత గౌరవ, ఘనత, రాజనీతి విధానాలపై దాడి కాదా..? అని ఎక్స్‌లో ప్రకటించారు. ఓ ఇంగ్లిష్ పత్రికలో ప్రచురితమైన సమాచారం ప్రకారం కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ నేతృత్వంలో పార్లమెంటు సభ్యుల బృందం, ఆపరేషన్ సిందూర పరిస్థితిని ప్రపంచ దేశాలకు వివరించేందుకు అమెరికా వెళ్లింది. ఎంపీ మిలింద్ దియారో, డొనాల్డ్‌ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీకి ట్రంప్ నుంచి సమయం, అనుమతులు పొందారన్నారు. ఇక్కడి యువ ఎంపీ తానేమీ తక్కువ కాదని... అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసేందుకు ప్రయత్నించగా జూనియర్ ట్రంప్ నుంచి అనుమతులు లభించలేదు. అంతటితో వదలకుండా నేరుగా ట్రంప్‌ను కలుస్తానని శపథం చేశారు. అమెరికాలోని తన మిత్రుడి ద్వారా ట్రంప్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. డొనాల్డ్ ట్రంప్ ఫ్లోడా నగరంలోని మార్ అ లాగు ఎస్టేట్‌కు ఎంపీ ఇద్దరుమిత్రులతో వెళ్లారు. ట్రంప్ ఈ భేటీని నిరాకరించి, అత్యంత తీవ్రంగా స్పందించారు. దీంతో ఎంపీకి అవమానం కాగా ఈ విషయమై ప్రధానమంత్రి కార్యాలయానికి సమాచారం చేరగా ఎంపీని మందలించినట్లు మంత్రి ప్రియాంక ఖర్గే ఎక్స్‌లో అభిప్రాయపడ్డారు.

కంది రైతులకు రూ.1,550 కోట్ల నష్టం

● విదేశాల నుంచి దిగుమతితో పడిపోయిన ధరలు ● కేంద్ర నిర్ణయంపై సుర్జేవాలా ఆగ్రహం

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కర్ణాటక రైతులను అన్ని విధాలా ఇబ్బంది కలిగిస్తోందని రాష్ట్ర కందిరైతులకు ఏటా రూ.1550 కోట్లు నష్టం కలుగుతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సుర్జేవాలా మండిపడ్డారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన కందిని మొజాంబిక్, మయన్మార్, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలనుంచి దిగుమతి చేసుకోవడం ద్వారా ఇక్కడి రైతులకు నష్టం కలుగుతోందన్నారు. ఈ ఏడాది జనవరి 20న కేంద్రం ఓ ఉత్తర్వు జారీ చేసిందని, దాని ప్రకారం 2026 మార్చి ఆఖరుదాకా పన్ను లేకుండా దిగుమతికి అవకాశం ఇచ్చిందని, ఇది రాష్ట్ర రైతులకు అన్యాయమన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలోనే కంది అత్యధికంగా సాగు అవుతోందన్నారు. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య కర్ణాటక ప్రభుత్వ



మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి సుర్జేవాలా

దివాళా తీసిందని వ్యాఖ్యానించే ముందు, అతడికి అమెరికాలో జరిగిన అవమానం దేశానికి అది అవమానం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలలో ప్రగతితోపాటు గ్యారెంటీ పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయనేది తెలుసుకునేందుకు బెంగళూరులో ఉన్నానన్నారు. మంగళవారం 22మంది ఎమ్మెల్యేలు కలిశారన్నారు.



ఫ్రీడంపార్కులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉద్యోగులు

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

● రాష్ట్రవ్యాప్తంగా విధుల బహిష్కరణ
● ఏడో వేతన కమిషన్ అమలు చేయాలని డిమాండ్
● బోసిపోయిన కార్యాలయాలు.. ప్రజలకు ఇబ్బందులు

వివరాలు..7లో..

చెత్తాచెదారంతో నిండిన సోమప్ప చెరువు

కంప్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కంప్లి నడిబొడ్డున ఉన్న ప్రతిష్టాత్మక సోమప్ప చెరువులో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, వ్యాయామం యోగ చేయడానికి, చేపలు పట్టుకోవడానికి చెరువు వద్దకు వస్తున్నారు. చెరువులో పిచ్చి మొక్కలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో విషపూరిత జంతువులు వస్తున్నాయని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. చెరువు చుట్టూ మొక్కలు నాటాలని కోరుతున్నారు. రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారిందని, పోలీసు సిబ్బంది గస్తీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చెరువు చుట్టూ విద్యుత్ కాంతి లైట్లు, చెత్త కుండీలు, తాగునీరు ట్యాంకులు మరుగుదొడ్లు ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా మార్చాలని కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిన సోమప్ప చెరువు



హైటెక్ హంగులతో ప్రభుత్వ పాఠశాల

విద్యాదాత!

● పేదల తలరాతలు మార్చిన మహనీయుడు
● సొంతూరి సర్కారు బడికి రూ.14 కోట్లు
● సర్వాంగ సుందరంగా భవనాలు
● ప్రైవేట్ తరహాలో కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ లైబ్రరీ, రవాణాకు ప్రత్యేక బస్సులు
● ఆదర్శప్రాయుడు డాక్టర్ వెంకటప్ప



బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): చదువుకున్న బడికి ఎందరో రంగులు వేయిస్తుంటారు, భవనాలు నిర్మిస్తుంటారు, ఏకంగా స్థలాలు ఇస్తుంటారు. అయితే తన దానగుణంతో ఏకంగా పాఠశాల రూపురేఖలు మార్చేశారు ఆ వైద్యుడు. సొంతూరు సర్కారు బడి శిథిలావస్థ దశకు చేరడాన్ని జీర్ణించుకోలేని ఓ వైద్యుడు ఏకంగా రూ.14కోట్లు ఖర్చు పెట్టి అత్యంత విలావవంతమైన సౌలభ్యాలతో హైటెక్ నిర్మాణాలు చేపట్టారు. అత్యుత్తమ సౌకర్యాలు కల్గిన హొంగనూరు పాఠశాల భవనం ప్రైవేట్ అంతర్జాతీయ విద్యాసంస్థల తరహాలో తయారైంది. హొంగనూరు డాక్టర్ హెచ్‌ఎం వెంకటప్ప తల్లిదండ్రుల స్మరణార్థం కణ్వ ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు కొత్తరూపు నిచ్చారు. జిల్లా కేంద్రమైన చామరాజనగర్ తాలూకా హొంగనూరు గ్రామంలోని చన్నమ్మ మంచేగౌడ కర్ణాటక పబ్లిక్ స్కూల్‌కు సమీప గ్రామాల ప్రజలు తమ పిల్లలను చేర్పేందుకు పోటీ పడుతున్నారు. ఇటీవల వేసవి సెలవులలో పాఠశాలను పూర్తిగా తొలగించి నూతన భవనాలు నిర్మించారు. ప్రస్తుతం 1నుంచి హైస్కూల్ వరకు 850మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది ఈ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీలను ప్రారంభించారు. ద్వితీయ పీయూసీ వరకు కన్నడ, ఇంగ్లిష్ మీడియంలలో బోధనలకు వెసలుబాటు ఉంది.

12 గ్రామాల నుంచి విద్యార్థులు

హైటెక్ పాఠశాలలో 1500మంది విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు నిర్మించారు. ఎల్‌కేజీ నుంచి ద్వితీయ పీయూసీ వరకు ఒకే క్యాంపస్‌లో గదులు ఉండేలా రూపొందించారు. గుణాత్మకమైన విద్య, సౌకర్యాలు ఉండడంతో సమీపంలోని 12 గ్రామాల ప్రజలకు ఇది అందుబాటులో ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 150మంది అడ్మిషన్ చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కాన్వెంట్ తరహా శిక్షణలు అందుబాటులోకి వచ్చాయి.



పాఠశాల కార్యాలయం

విద్యార్థులు ఉన్నత స్థితికి చేరాలన్నదే ఆశయం

: డాక్టర్ హెచ్‌ఎం వెంకటప్ప



ఇక్కడి బడిలో చదువుకున్న పేద విద్యార్థులు సైతం ఉన్నతస్థాయికి వెళ్లాలనేది నా ఆశయం. కొందరు కోట్లాదిరూపాయలు ఖర్చు పెడుతున్నారు... మీకేం లాభమని అడిగారు. నేను ఇక్కడే చదువుకుని డాక్టర్‌ని అయ్యాను. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా 24 సంవత్సరాలు సేవ చేసి వలంటరీగా రిటైర్ అయ్యాను. ఆ తర్వాత బెంగళూరులో కణ్వ డయాగ్నస్టిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంపాదన, సంస్థ ప్రగతి బాగుంది. నేను చదువుకున్న పాఠశాలలో నాకంటే ఉత్తమమైన హోదాకు వెళ్తే అదే నాకు లభించే లాభం, నా ఆశయానికి సార్థకం. పాఠశాల భవనాల నిర్మాణంతో నా లక్ష్యం పూర్తికాలేదు. ఏటా 10లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాను. ప్రైవేట్ పాఠశాల తరహాలో అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నాను. చుట్టుపక్కల 12 గ్రామాలనుంచి విద్యార్థులు నడిచి వస్తున్నారు. వారికోసం రెండు బస్సులు ఏర్పాటు చేయబోతున్నాం. ప్రస్తుతానికి 51 తరగతి గదులు నిర్మించాం. 10వేల పుస్తకాలతో లైబరీ ఉంది. 40 కంప్యూటర్లతో ల్యాబ్, సైన్స్, మ్యాథ్స్‌ల కోసం ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి. డెస్కులు, బల్లలతోపాటు డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశాం. ప్రతి అంతస్తులోనూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు శౌచాలయాలు ఉన్నాయి. సభావేదిక, బాస్కెట్‌బాల్ మైదానంతో పాటు పలు సౌలభ్యాలు ఏర్పాటు చేశాం. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం. ఏటా అతిథి ఉపాధ్యాయులను నియమించుకుని అన్ని తరగతులకు అన్ని సబ్జెక్టులకు బోధనలు ఉండేలా వీలు కల్పించామన్నారు.

పాయసం తిని పలువురికి అస్వస్థత



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో దేవుడికి నైవేద్యంగా సమర్పించిన పాయసం తిని 15మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు తెలిపిన మేరకు తొలి ఏకాదశి సందర్భంగా ఆకుతోటపల్లికి చెందిన బాలకృష్ణ ఇంటిలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవుడికి నైవేద్యంగా పెట్టిన పాయసాన్ని సోమవారం సాయంత్రం పూజలు, భజనకు వెళ్లి భక్తులు తిన్నారు. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. 15మంది అస్వస్థతకు గురికాగా, 8మంది ప్రభుత్వ వైద్యశాలలో, మిగిలినవారు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ మాట్లాడుతూ పాయం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యారన్నారు. వైద్య బృందం ఆకుతోటపల్లిలో ఇంటింటా పర్యటించి అవసరం మేరకు వైద్యసేవలు అందిస్తామన్నారు. కాగా పాయసం తిని అస్వస్థతకు గురైన వారిని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మంగళవారం పరామర్శించారు.

ముగిసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు

ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నం

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ మంగళవారం ముగిసింది. స్థానిక ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో సీనియార్టీకి అనుగుణంగా 5 సంవత్సరాలు పూర్తయిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, గతనెల ఆఖరులో బదిలీలు ప్రక్రియ ముగించారు. మరో 5 రోజులు గడువు పొడిగించడంతో 5వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది. తప్పిదాలను సరిదిద్దడంలో యంత్రాంగం నిమగ్నమైంది. సిఫార్సులకు అనుగుణంగా తుది జాబితా సిద్ధం చేయడానికి మరో రెండు రోజులు పట్టింది. ఎట్టకేలకు మంగళవారం జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో ప్రొసీడింగ్స్ జారీ చేయడంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్న 253 మందికి స్థానచలనం కల్పించారు. రిక్వెస్టు కింద 18 మందికి, అనారోగ్య కారణాలతో 8 మందిని బదిలీ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు..

ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-5, గ్రేడ్-6 (డిజిటల్ అసిస్టెంట్ల) బదిలీ ప్రక్రియ మంగళవారం ముగిసింది. అందుకు అనుగుణంగా ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలోని డీపీఓ కార్యాలయంలో గతనెల ఆఖరులో కౌన్సెలింగ్ నిర్వహించారు. తుది జాబితా సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపారు. సిఫార్సులకు అనుగుణంగా అవకాశం కల్పించడానికి మరింత సమయం పట్టినట్లు తెలిసింది. ఎట్టకేలకు జాబితాకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో మంగళవారం బదిలీల ప్రక్రియకు సంబంధించి ప్రొసీడింగ్స్ జారీ చేశారు.

చేనేత డిజైనర్‌కు జాతీయ అవార్డు



డిజైనర్ నాగరాజు

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజును డిజైన్ డెవలెప్‌మెంట్‌లో జాతీయ అవార్డు వరించింది. చేనేత డిజైన్ డెవలెప్‌మెంట్, మార్కెటింగ్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఈనెల 7న న్యూఢిల్లీలో జాతీయ అవార్డులను ప్రకటించినట్లు డిజైనర్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 19 అవార్డులను ప్రకటించగా మన ఆంధ్రప్రదేశ్‌కు 3 అవార్డులు వచ్చాయన్నారు. అవార్డును ఆగస్టు 7న న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నట్లు నాగరాజు తెలిపారు.

మున్సిపల్ ఆర్డీగా రవీంద్రబాబు

కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా విశ్వనాథ్ బదిలీ



రవీంద్రబాబు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ శాఖ ప్రాంతీయ సంచాలకుడి(ఆర్డీ)గా రవీంద్రబాబు నియమితుడయ్యారు. ఇక్కడ ఆర్డీగా పనిచేస్తున్న విశ్వనాథ్‌ను కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బదిలీ చేశారు. కర్నూలు కమిషనర్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబును ఆర్డీగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రెండ్రోజుల్లో రవీంద్రబాబు ఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్లేస్‌మెంట్లు ఖరారు

అనంతపురం న్యూటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): డీప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, ధర్మవరం డీఎల్‌పీఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న లీలాబాయి, విజయ్‌కుమార్, పామిడి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి అశ్వత్థనాయుడుకు డీప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించిన విషయం తెలిసిందే. వారికి డీపీఓ నాగరాజనాయుడు ప్లేస్‌మెంట్లు ఖరారు చేశారు. లీలాబాయి కంబదూరుకు, విజయ్‌కుమార్ శింగనమలకు, అశ్వర్థనాయుడు పామిడి డిప్యూటీ ఎంపీడీఓగా నియమించాలని రిక్వెస్టు పెట్టుకున్నారు. ఆ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నా భర్త కనిపించట్లేదు

ఎమ్మెల్యేకి ఫిర్యాదు

నల్లమాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): తన భర్త రమణ కనిపించకుండా పోయాడని మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన దేవరకొండ రాజేశ్వరి.. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి ఫిర్యాదు చేసింది. మంగళవారం మండలంలోని మూలప్పగారిపల్లిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాజేశ్వరి మాట్లాడుతూ.. తన భర్త గతనెల 15వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయాడనీ, తిరిగి రాలేదని తెలిపింది. ఎమ్మెల్యే వెంటనే ఇన్‌చార్జి ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యాదు అందించారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

11న వాహనాల వేలం

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 11న వేలం వేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొని వాహనాలు తీసుకోవచ్చన్నారు. వివరాలకు అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను కలవాలని ఆయన సూచించారు.

యువతిని కాపాడిన పోలీసులు

గుంతకల్లుటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): చనిపోతున్నానంటూ తండ్రికి మెసేజ్ పెట్టిన యువతిని టూటౌన్ పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగుంతకల్లులో నివాసముంటున్న కురువ శివప్ప కుమార్తె డిగ్రీ చదువుకుంది. సోమవారం రాత్రి 7 గంటలకు యువతి ఎవరికీ చెప్పకుండా కోపంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. చనిపోతున్నానంటూ తండ్రికి ఫోన్ ద్వారా మెసేజ్ చేసింది. దీంతో ఆందోళన చెందిన తండ్రి.. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రాత్రి 8.30 గంటలకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ సీఐ మస్తాన్.. సిబ్బందితో యువతి ఫోన్ లొకేషన్ ఆధారంగా వెతకడం మొదలు పెట్టారు. అర్ధరాత్రి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. తల్లిదండ్రులను పిలపించి ఆ యువతిని అప్పగించారు.

న్యూఢిల్లీకి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దేశ రాజధానిలో బుధవారం నిర్వహించే జాతీయ డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్) వర్క్‌షాప్‌లో పాల్గొననున్నారు.

రాయలసీమకు సామాజిక న్యాయం చేయాలి

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా



మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతానికి సామాజిక న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేత ఎస్ఎం బాషా పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం రాయలసీమ సమస్యలపై నిర్వహించిన చర్చా వేదికకు ఎస్ఎం బాషా హాజరయ్యారు. సెప్టెంబరు 14న ప్రజా ఉద్యమకారుడు పసలూరి ఓబులేసు ఆధ్వర్యంలో రాయలసీమ ప్రజావేదిక ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో స్థానికంగా ప్రజాసంఘాలు, మేధావుల సూచనలు, సలహాలకోసం చర్చావేదిక ఏర్పాటు చేశారు. ఎస్ఎం బాషా మాట్లాడుతూ... రాయలసీమలో తన సామాజిక ఉద్యమ చరిత్రలో మొదటిసారి సామాజిక రాయలసీమ అంశం చర్చకు వచ్చిందన్నారు. ఇది ఎంతో శుభదాయకమన్నారు. ఆయావర్గాలు ప్రజాక్షేత్రంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన విధానాల విషయంలో ఒకే రకంగా ఉండాలన్నారు. దేశంలోని అన్ని ఐజీటీల్లో రిజర్వేషన్లు ఉన్నాయనీ, తిరుపతిలో లేకపోవడం వెనుక కుట్ర ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోనూ ఉద్యోగ నియామకాల్లో రాయలసీమ అభ్యర్థులకు అన్యాయం వాటిల్లే ప్రమాదముందని వాపోయారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రాచర్ల హరి, బీటీపీ గోవింద్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, రాయలసీమ ప్రజాసమితి నాయకుడు శంకర కుళ్లాయప్ప, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు రాజారత్నం పాల్గొన్నారు.

అప్పు చెల్లించమన్నందుకే హత్య

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): అప్పుగా ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లించాలని అడిగిందన్న కోపంతో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని చింతా రమాదేవి వడ్డీ వ్యాపారంతో జీవనం సాగించేది. ఈక్రమంలోనే తన ఇంటి పక్కనే ఉన్న యలమకూరు రాజశేఖర్‌కు రెండేళ్ల కిందట రూ.10వేలు అప్పుగా ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత తన అప్పు తీర్చాలని రమాదేవి తరచూ రాజశేఖర్‌ను అడిగేది. దీంతో ఆయన రూ.5వేలు ఇచ్చి, మిగిలింది తరువాత ఇస్తానని చెప్పాడు. మరికొన్ని రోజుల తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని రాజశేఖర్ ఇంటికి వెళ్లి రమాదేవి డిమాండ్ చేశారు. ఇంటి వద్దకు వచ్చి డబ్బులు అడగడాన్ని అవమానంగా భావించిన రాజశేఖర్ గత నెల 29న రమాదేవి ఇంటిలోకి వెళ్లి ఆమెను కొట్టి, అరవకుండా నోరు మూసిపెట్టి కిందకు పడేశాడు. అనంతరం తాడుతో రమాదేవి గొంతును బిగించాడు. పెనుగులాటలో ఆమె ఎలా గోలా తప్పించుకుని ధర్మవరం ఆస్పత్రికి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల నాలుగో తేదీ మృతిచెందారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, రాజశేఖర్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.12 లక్షల విలువైన ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్, టూటౌన్ సీఐలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగ విక్కీ అలియాస్ షామీర్(20)ను అనంతపురం సీసీఎస్, టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.12 లక్షల విలువైన ఆభరణాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసిన షాపు నిర్వాహకుడిని అరెస్టు చేశారు. దొంగ అరెస్టు వివరాలను మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐలు వలి బాషా, జయపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌చౌదరి, ఎస్ఐ రుషేంద్రబాబు వెల్లడించారు. గుజరాత్ రాష్ట్రం సూరత్‌లోని రాంనగర్‌కు చెందిన సలీం కుమారుడు విక్కీ అలియాస్ షామీర్ ఆరేళ్ల వయసులో తప్పిపోయాడు. అనంతపురం చేరుకోగా కొందరు స్థానికంగా విజయనగర్ కాలనీలోని అనాథ వరణాలయంలో చేర్చారు. అక్కడే ఉంటూ రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి వరకూ చదివాడు. ఈ క్రమంలో చిన్న చిన్న చోరీలు చేశాడు. రాత్రిళ్లు ఇళ్లలో చోరీలు చేస్తూ వచ్చాడు. అలా.. అనంతపురం టూటౌన్ పరిధిలో 2024 నవంబరులో విద్యుత్ నగర్ సర్కిల్‌లో ఓ ఇంట్లో వారం రోజుల్లోనే రెండుసార్లు చోరీ చేసి 2 బంగారు గాజులు అపహరించాడు. వన్‌టౌన్ పరిధిలో జూన్‌లో ద్విచక్రవాహనాన్ని అపహరించాడు. గతనెలలో గోవాలోనూ ఐఫోన్, యాపిల్ లాప్‌టాప్ అపహరించాడు. చోరీలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అందులో భాగంగా నగర పరిధిలోని ప్రసన్నాయపల్లి రైల్వేగేటు వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన ఫరూక్ మొబైల్ షాపు యజమాని ఫరూక్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12 లక్షల విలువైన ఆరు తులాల బంగారు గాజులు, 12 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వివరించారు.

కడప విజయం

డ్రాగా ముగిసిన చిత్తూరు, అనంత మ్యాచ్

మల్టీ డే క్రికెట్ టోర్నీ



ధ్రువకుమార్ రెడ్డి



శ్రీకాంత్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మూడోరౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజయం సాధించగా, చిత్తూరు-అనంతపురం మ్యాచ్ డ్రాగా ముగిసింది. సీనియర్ మల్టీ డే క్రికెట్ మూడో రౌండ్ పోటీలు సోమవారం స్థానిక అనంత క్రీడా గ్రామంలో చివరిరోజు కొనసాగాయి. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 115.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. ఆతిథ్య అనంతపురం జట్టు ఓవర్‌నైట్ స్కోరు 199/4తో మూడోరోజు మంగళవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించింది. 90 ఓవర్లలో 377 పరుగులకు ఆలౌటైంది. దత్తారెడ్డి సెంచరీ (164)కితోడు గిరినాథ్‌రెడ్డి (37) పర్వాలేదనిపించాడు. చిత్తూరు బౌలర్ శ్రీకాంత్ 5, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 40 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. ధరణీ కుమార్ (81), మోనిష్ (64), జ్ఞానేశ్వర్ (41) రాణించారు. చివరి రోజు కావడంతో మ్యాచ్‌ను డ్రాగా నిర్ణయించారు. రాయలసీమ్ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 65 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్ ప్రారంభించిన కడప 69.1 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు రెండో ఇన్నింగ్స్‌లో 47.5 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. 260 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప 43.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 263 పరుగులు సాధించింది. ధ్రువ కుమార్ రెడ్డి సెంచరీ (101), ధనుష్ హాఫ్ సెంచరీ(56)తో జట్టును విజయతీరాలకు చేర్చారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, దీని కారణంగా ఎన్నో త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులందరూ సమ్మెకు మద్దతుగా బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు మన్నీల రామాంజనేయులు పాల్గొన్నారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవీకాలం ముగిసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీ)కు త్రిసభ్య కమిటీలను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల పాటు త్రిసభ్య కమిటీల కాలపరిమితి విధించారు.

సొసైటీ పేరు	సొసైటీ చైర్మన్	కమిటీ సభ్యులు
చియ్యేడు	లక్ష్మీనారాయణ	శ్రీరాములు, సుధాకర్ రెడ్డి
మరూరు	గోపాల్	గంగాధర్, ముసలప్ప
శింగనమల	జి. లక్ష్మీనారాయణ	బాలరాజు, లక్ష్మీ
భైరవానితిప్ప	బోయ ఓబులేసు	శివలింగమూర్తి, ధనుంజయ్య
శెట్టూరు	రంగప్పచౌదరి	వెంకటేష్, ఖాదర్‌వలి
శ్రీధరఘట్ట	ఎర్రిస్వామి	మోహన్‌రెడ్డి, రుద్రముని
ఉద్దేహాళ్	మల్లికార్జున	లేపాక్షి, మృతుంజయ్య
గొడిసెలపల్లి	ఆర్ హనుమంతరెడ్డి	పరమేశ్వరప్ప, బ్రహ్మానందరెడ్డి
ఎం హనుమాపురం	బిందె హనుమంతరెడ్డి	రామాంజనేయులు, మేఘనాథ్‌రెడ్డి
మల్లికేతి	మల్లికార్జున రెడ్డి	గూలెప్ప, భీమక్క
కలుగోడు	నీరగంటి తిమ్మప్ప	దేవిప్రసాద్, పెద్దరామప్ప
బ్రహ్మసముద్రం	బోయ రామంజనేయులు	మేఘనాథ్, తిప్పయ్య
కణేకల్లు	చంద్రశేఖర్ గుప్తా	హనుమప్ప, సువర్ణమ్మ
74-ఉడేగోళం	ఓబయ్య	తిప్పేస్వామి, శశిధర్

ఈ సొసైటీలకు ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే కాలపరిమితి విధించారు.

- అక్టోబరు 30వరకు బుక్కచెర్ల సొసైటీ చైర్మన్‌గా బ్రహ్మానందరెడ్డి, సభ్యులుగా కిష్టయ్య, సుబ్బమ్మకు కాలపరిమితి విధించారు.

సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

అనంతపురంరూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభమైంది. అనంతపురం జేఎన్‌టీయూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. హెల్ప్‌లైన్ సెంటర్‌కు హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్లను జేఎన్‌టీయూ అడ్మిషన్ల డైరెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో పరిశీలన చేపట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అడ్మిషన్ల డైరెక్టర్ మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు హెల్ప్‌లైన్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులు కౌన్సెలింగ్ ప్రక్రియతో పాటు, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా విద్యార్థులు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడంలో పొరబాట్లు చేస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల పేరున సర్టిఫికెట్లను తీసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ కేటగిరీ (స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సీఏపీ) తదితర వాటి కింద అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నామన్నారు.

ఐఈఆర్టీల రెగ్యులర్‌కు అడుగులు

అనంతపురం విద్య, జూలై 8(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష పరిధిలోని ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో పనిచేస్తున్న ఐఈఆర్టీలను రెగ్యులర్ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్టీల అర్హతలను పరిశీలించడానికి స్క్రీనింగ్ కమిటీని మంగళవారం రాష్ట్రప్రభుత్వం నియమించింది. ఉమ్మడి అనంత జిల్లాలో 60 మంది ఐఈఆర్టీలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఐఈఆర్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగ్గురిపై హత్య కేసు

గాండ్లపెంట, జూలై8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టకిందపల్లిలో జరిగిన రంగారెడ్డి హత్యలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు సోమవారం గుట్టకిందపల్లిలో రంగారెడ్డిని హత్య చేశారన్నారు. మంగళ వారం సీఐ, ఎన్పీకుంట ఎస్ఐ వలీ బాషా సంఘటనా స్థలాన్ని పరిశీ లించి, విచారణ చేపట్టారు. మృతుడి వదిన వెంకటరత్నమ్మ ఫిర్యాదు మేరకు... సోమవారం ఫీల్డు అసిస్టెంట్ మనోహర్ ఇంటివద్ద ఉపాధి బిల్లులు పెట్టులేదని రంగారెడ్డి వాగ్వాదం చేశాడు. అదే రోజు రాత్రి రంగారెడ్డితో ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, దాద్దెప్ప, భార్య స్వాతి ఘర్షణకు దిగారు. ఈక్రమంలో రంగరారెడ్డిని తోసేయడంతో సిమెంటు రోడ్డుపై పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు

వాణిజ్య పన్నులశాఖ అధికారులకు పోస్టింగ్

అనంతపురం కలెక్టరేట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖలో నలుగురు అధికారులపై సస్పెన్షన్‌ను రద్దు చేశారు. వారిలో ముగ్గురు అధికారులకు పోస్టింగ్ సైతం కేటాయించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సర్కిల్‌లో పనిచేస్తున్న సీటీఓ క్రిష్ణవేణి, డీసీటీఓలు మధసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఇంతియాజ్ అహ్మద్‌పై ఆరోపణలు రావడంతో విచారించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఆ నలుగురిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఆ నలుగురిపై సస్పెన్షన్ రద్దు చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. వారికి పోస్టింగ్ సైతం ఇచ్చారు. సీటీఓ క్రిష్ణవేణిని వైఎస్సార్ కడప జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సీటీఓగా నియమించారు. డీసీటీఓలు మధుసూదన్ రెడ్డిని కడప జిల్లా రాజంపేట సర్కిల్‌కు, రాజశేఖర్ రెడ్డిని కడప జిల్లా పులివెందులకు, ఇంతియాజ్ అహ్మద్‌ను చిత్తూరు-2 సర్కిల్‌కు కేటాయించారు.

సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో 'అనంత' పీజీల ప్రతిభ



పతకాలు సాధించిన వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం వైద్యం, జూలై 8(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ కాన్ఫరెన్స్‌లో అనంత వైద్య కళాశాల అనస్థీషియా పీజీ విద్యార్థులు అదరగొట్టారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన దక్షిణ భారత రాష్ట్రాల అనస్థీషియా సదస్సులో కళాశాల పీజీ వైద్య విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు సాధించారు. పతకాలను సాధించిన విద్యార్థులను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ షారోన్‌సోనియా, అనస్తీషియా విభాగాధిపతి నవీన్ కుమార్ అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రీ పేపర్ విభాగంలో డాక్టర్ గౌతమి, క్విజ్‌పోటీల్లో డాక్టర్ పూజ, సుధీర్, రీల్స్ విభాగంలో డాక్టర్ శ్రీధర్ సౌత్ జోన్ అవార్డులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కేఎల్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నాగేంద్ర, మధుసూదన్, జగదీశాచార్యులు, హరికృష్ణ, గంగాధర్, సోమశేఖర్, షెలియా డైనీ పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి పోలీసుల తనిఖీలు

అనంతపురం క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణ కోసం అనంతపురం పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు జగదీష్, శాంతిలాల్, ఇతర సిబ్బంది గంజాయి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. రంగస్వామినగర్, రుద్రంపేట, డీమార్ట్ వెనుక వైపు ప్రాంతంలో పలు చోట్ల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా చట్టా రీత్యా నేరం అన్నారు. గంజాయి నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. గంజాయి రహిత నగరమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఎవరూ గంజాయి జోలికి వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

మిరపా.. వద్దులే..!

మిరప సాగుకు ఆసక్తి చూపని రైతులు



ఏసీ గోడౌన్‌ల్లో నిలువ ఉన్న గత ఏడాది మిరప పంట

విడపనకల్లు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక నష్టాలు వస్తుండటంతో ఈ ఏడాది మండల రైతులు మిరప సాగువైపు మొగ్గు చూపడం లేదు. గత ఏడాది ఉరవకొండ నియోజకవర్గంలో దాదాపుగా 40వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది కనీసం 30వేల ఎకరాల్లో అయినా సాగు చేస్తారా అనే సందేహం కలుగుతోంది. మండలంలో మిరప రైతుల సందడి ఎక్కడా కనిపించటం లేదు. గత ఏడాది ఒక క్వింటా డబ్బి రకం విత్తనం రూ.70వేలు, కడ్డీ రకం విత్తనం రూ.65వేలు ప్రకారం కొనుగోలు చేశారు. ఈ సారి క్వింటా రూ.20వేలు, రూ.30వేలకు కూడా కొనటం లేదని వివిధ ప్రాంతాల్లో విత్తన దుకాణాల యజమానులు చెబుతున్నారు. కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నారు.

నల్లతామరకు ఎదురు నిలిచి...

గత ఏడాది మిరప రైతులను నల్ల తామర పురుగు నిలువునా ముంచేసింది. కాయలు ఎర్రబారుతున్న సమయంలో నల్లి పురుగు సోకింది. అధిక వర్షాలు కురువటం వల్ల నల్లిపురుగు సోకి కాయలు, పూత కుళ్లి పోయి దిగుబడి పడిపోయింది. అయినా రైతులు పంటలను కాపాడుకుని ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడిని సాధించారు. పండించిన పంటకు గిట్టు బాటు ధర లేకపోవటంతో కర్ణాటకలోని బ్యాడిగి, హంట్లీ, బళ్లారి, విడపనకల్లు, గుంతకల్లు వంటి ప్రాంతాల్లోని ఏసీ గోడౌన్‌ల్లో నిల్వ చేశారు. కొంత మంది రైతులు 2023, 2024 రెండు సంవత్సరాల పంటను అలాగే ఉంచారు. గిట్టుబాటు ధరల కోసం ఎదురు చూసి పండించిన పంటల ను ఏసీ గోడౌన్‌లోనే వదిలేశారు.

మిరప మిషన్లకు తగ్గిన గిరాకీ

గత ఏడాది విత్తనాల కోసం రోజు 100 నుంచి 150 బస్తాలు మిరప కాయలను మిషన్లకు వేసేవారు. దీనికి కారణం రైతులు మిరప సాగుకు మొగ్గు చూపటం. ఈ ఏడాది జూలైలో ఓ వారం గడిచినా మిరప విత్తనాలు కోసం రైతులు రాకపోవటంతో విత్తన సాగు అంతంత మాత్రమే అనిపిస్తోంది. ప్రస్తుతం రోజుకు ఒక మిషన్‌కు 20 నుంచి 30 బస్తాలు కూడా ఆడించటం లేదు.

మిరప రకాలు...దిగుబడులు

మిరప రకాన్ని బట్టి దిగుబడులు ఉంటాయి. సింజెంటా బ్యాడిగి రకం ఎకరాకు 22 నుంచి 26 క్వింటాళ్లు, గుంటూరు నాటీ వెరైటీ ఎల్‌సీ రకం 28 నుంచి 31 క్వింటాళ్లు, బీఎస్ఎఫ్ ఆర్మూర్ రకం 30 నుంచి 40 క్వింటాళ్లు, డబ్బి రకం ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు, గుంటూరు కారం కడ్డీ రకం 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి.



సిద్ధం చేసుకున్న మిరప విత్తనాలు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

గుమ్మడి వెంకటేశ్వరరావు (జయంతి)



ఇంటి పేరు 'గుమ్మడి'గానే పేరొందిన 'కళాప్రపూర్ణ' గ్రహీత గుమ్మడి వెంకటేశ్వర రావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి సమీపాన రావికంపాడు గ్రామంలో జన్మించారు. తెలుగు చలనచిత్రరంగంలో ఐదు దశాబ్దాలకుపైగా 500కంటే ఎక్కువ సినిమాలలో విభిన్న తరహాపాత్రలలో పోషించారు. పౌరాణిక, చారిత్రక, జానపద, సాంఘిక చిత్రాలలో అన్నిరకాల సినిమాలలో తండ్రిగా, అన్నగా, తాతగా పలు పాత్రలలో నటించి మెప్పించారు. రఘుపతి వెంకయ్య, పద్మశ్రీ, రాష్ట్రపతి అవార్డు, నంది అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 2010 జనవరి 26న కన్నుమూశారు.

కె.బాలచందర్ (జయంతి)



జాతీయస్థాయిలో పేరొందిన సినీ దర్శకులలో కే బాలచందర్ ఒకరు. ఆయన 1930 జూలై 9న తమిళనాడు రాష్ట్రం తంజావూరు దగ్గర నన్నిలం ప్రాంతంలో జన్మించారు. రచయిత, నిర్మాత, నటుడు కూడా. ఐదు దశాబ్దాల కెరీర్‌లో తమిళం, తెలుగు, కన్నడ భాషలలో వందకుపైగా సినిమాలు రూపొందించారు. పదులసంఖ్యలో నటులను వెండి తెరకు పరిచయం చేశారు. నగేశ్, సుజాత, కమల్ హాసన్, రజనీకాంత్, చిరంజీవి, జయప్రద, శ్రీదేవి, జయసుధ వంటివారు ఉన్నారు. 'రోజా'తో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌ను పరిచయం చేశారు. పద్మశ్రీ, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు సహా 9 జాతీయ సినీ అవార్డులు, 13ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డులు, 'కళైమామణి' ఇతరత్రా గౌరవాలు పొందారు. 2014 డిసెంబరు 23న కన్నుమూశారు.

యూజీ కృష్ణమూర్తి (జయంతి)



యూజీగా సుపరిచితులైన తత్వవేత్త ఉప్పులూరి గోపాల కృష్ణమూర్తి 1918 జూలై 9న మచిలీపట్నంలో జన్మించారు. థియోసాఫికల్ సొసైటీలో సభ్యుడిగా కొనసాగారు. స్వామి వివేకానందతో కలసి హిమాలయాలలో పలుమార్లు యోగా, ధ్యానం చేసిన ఘనత ఆయనది. మంచి వక్తగా పేరొందారు. ఆయన తత్వం విభిన్నంగా ఉండే ది. పలు పుస్తకాలు రచించారు. 2007 మార్చి 22న కన్నుమూశారు.

గురుదత్ (జయంతి)



'గురుదత్'గా చిరపరిచితులైన వసంత్‌కుమార్ శివశంకర్ పడుకొనె 1925 జూలై 9న కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా బైదూరు తాలూకా పడుకొనె గ్రామంలో జన్మించారు. దర్శకుడిగా, నిర్మాతగా, నటుడి, కొరియోగ్రాఫర్‌గా రాణించారు. 1950, 60 దశకాల మధ్య క్లాజికల్ సినిమాలు 'ప్యాసా', కాగజ్ కే ఫూల్, సాహిబ్ ఔర్ గులామ్ ఎంతో పేరొందాయి. ఆయన సినిమాలు దేశంలోనేకాక ప్రపంచవ్యాప్తంగా జరిగిన చిత్రోత్సవాలలో ప్రదర్శించ బడ్డాయి. 39వ యేట 1964 అక్టోబరు 10న కన్ను మూశారు. 2004లో ఆయన స్మారక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

టామ్ హాంక్స్ (పుట్టినరోజు)



అమెరికా దేశ కల్చరల్ ఐకాన్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు థామస్ జెఫ్రీ హాంక్స్ 1956 జూలై 9న జన్మించారు. దర్శకుడిగాను రాణించారు. కామెడీ, డ్రమటిక్ రోల్స్‌తో పేరొందారు. 7 ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డులు, 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్', బాఫ్టా అవార్డు, కెన్నెడీ సెంటర్ అవార్డు తదితర అవార్డులు అందుకున్నారు. 2019లో 'ది బెస్ట్ యాక్టర్స్ ఇన్ ఫిల్మ్ హిస్టరీ'లో ఒకటవ ర్యాంకులో నిలిచారు. యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ రేంజర్స్‌లో గౌరవ సభ్యత్వం కల్గిన తొలి నటుడు.

ఉన్నికృష్ణన్ (పుట్టినరోజు)



పీ ఉన్నికృష్ణన్ 1966 జూలై 9న కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. కర్ణాటక సంగీతంలోనూ 12వ యేటనే తనదైన ప్రతిభను చాటారు. 1992 నుంచి ప్రముఖ నేపథ్య గాయకుడిగా రాణిస్తున్నారు. ఉత్తమ నేపథ్యగాయకుడిగా నేషనల్ ఫిల్మ్ అవార్డుతోపాటు కళైమామణి, నాదభూషణం, సంగీత చక్రవర్తి, తదితర పురస్కారాలు అందుకున్నారు. బుల్లి తెరపై పాటల పోటీలకు న్యాయనిర్ణేతగా ఉన్నారు.

నెలాఖరున క్వాంటమ్ ఇండియా బెంగళూరు సమ్మిట్

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెలాఖరున దేశంలో తొలి క్వాంటమ్ రీసెర్చ్ టెక్నాలజీ అండ్ బిజినెస్ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. రెండు రోజులపాటు జరిగే సదస్సుకు విశ్వవ్యాప్తంగా పేరొందిన క్వాంటమ్ లీడర్స్, స్టార్టప్స్, పరిశోధక విభాగాల ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీశాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు ప్రకటించారు. మంగళవారం నగరంలోని జవహర్‌లాల్‌నెహ్రూ ప్లానెటోరియంలోని డాక్టర్ యూఆర్ రావ్ ఆడిటోరియంలో క్వాంటమ్ సదస్సు సన్నాహకసభ జరిగింది. శాస్త్రీయ ప్రతిభ, అభివృద్ధి కల్గిన ఆధునిక వ్యవస్థ రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. క్వాంటమ్ ఇండియా బెంగళూరు కేవలం ఒక రౌండ్‌టేబుల్ సదస్సు కాదని, శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచ దిగ్గజ కంపెనీలతో జరిగే మహత్తరమైన అభిప్రాయ సేకరణ అన్నారు. కర్ణాటకలో పెరిఫెరల్స్ అండ్ హార్డ్‌వేర్, ఆరోగ్య రక్షణ తదితర అంశాలలో పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థల ముఖ్యులు భాగస్వామ్యులు అవుతార న్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీబీటీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏకరూప్‌కౌర్, ఎంఎం యాక్టివ్



మీడియా సమావేశంలో మంత్రి బోసరాజు తదితరులు

సైన్స్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జగదీశ్ పటన్‌కర్, ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ అరిందమ్ ఘోష్, ప్రొఫెసర్ అక్షయ్‌నాయక్, ఐఏఎస్ అధికారి సదాశివప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఏడో వేతన కమిషన్ అమలు చేయాలి

» మున్సిపల్ ఉద్యోగుల డిమాండ్

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. నగరంలోని ఫ్రీడం పార్కులో మంగళ వారం వేల సంఖ్యలో పాల్గొని ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రధానంగా ఏడో వేతన కమిషన్ అమలు చేయాలని, 6 వేలకుపైగా ఖాళీగా పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై ఒత్తిడి పెరిగిందన్నారు. బీబీఎంపీ న్యూ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు నిరసనకు పిలుపునివ్వడంతో బీబీఎంపీతోపాటు వివిధ మునిసిపాలిటీలకు చెందిన ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. కొంత మంది ఉద్యోగులకు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే సస్పెండ్ చేశారని, పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంతోపాటు సీని యారిటీ ప్రాతిపదికన అర్హులైన



కార్యాలయానికి తాళం

వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగులు సామూహికంగా విధులు బహిష్కరించడంతో కార్యాలయాలు బోసిపోయాయి.

రెండోరోజూ...

మున్సిపల్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ సామూహికంగా విధులను బహిష్కరించి ఫ్రీడం పార్క్‌కు చేరుకున్నారు. మైసూరు, మంగళూరు, హుబ్బళ్ళి -ధారవాడ, తుమకూరు, శివమొగ్గ, బెళగావి, దావణగెరె తదితర నగరాలలో నిరసన కొనసాగింది. ఏడో వేతన కమిషన్ అమలు, ఆరోగ్య బీమా వర్తింపచేయడం, రాష్ట్రస్థాయి ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని, వివిధ హోదాలలోని పదోన్నతులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.



ఉద్యోగులు విధులు బహిష్కరించడంతో వెలవెలబోతున్న బీబీఎంపీ ప్రధాన కార్యాలయం

కైవారలో గురుపూజా సంగీతోత్సవం ప్రారంభం



కైవార తాతయ్య మూలవిరాట్టు

చింతామణి, జూలై8(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని శ్రీక్షేత్రం కైవారలోని యోగి నారేయణమఠంలో గురుపూర్ణిమను పురస్కరిం చుకుని మూడు రోజులపాటు సాగే గురుపూజా సంగీతోత్సవాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళ వాయిద్యాలతో గోపూజ నిర్వహించి తాతయ్య ప్రథమ దర్శనాన్ని చేయించారు. తాతయ్య మూల విరాట్టును పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం గురుపూజా సంగీతోత్సవాన్ని ప్రారంభించారు. ధర్మాధికారి సంకీర్తన అనంతరం చిక్కబళ్ళాపుర, కోలారు జిల్లాల విద్వాంసులు సంగీతాన్ని సమర్పించారు. స్థానిక నాదస్వర, తబలా వాదకులు పాల్గొన్నారు. యోగి నారేయణ సభాంగణంలో సంగీత కచేరి వ్యవస్థ చేశారు. భారీ వేదికపై అమర నారేయణ స్వామి, భీమలింగేశ్వరస్వామి వేదికగా విభజించి ఇరువైపులా సంగీత కళాకారులు ఆశీనులయ్యేలా వ్యవస్థ కల్పించారు. మధ్యాహ్నం సంగీత కార్యక్రమంలో బంగారపేట వేణుగోపాల్, సునంద భాగవతారిణి, డాక్టర్ శ్రీనివాస్, జీ వేణుగోపాల్, నాగరాజ్, పట్టాభిరామిరెడ్డి, కోడి చెరువు నాగరత్నమ్మ, సీఆర్ నటరాజ్, శ్యామల శ్రీనివాస్, విశ్వప్రియా, చింతలపల్లి సోమశేఖర్, విద్యాలత, సణ్ణకల్ వెంకటరాయప్ప బృందం, బ్రహ్మేంద్ర తదితరులు సంగీతాన్ని సమర్పించారు.



సంగీతోత్సవంలో సంకీర్తన చేస్తున్న డర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

గురుపూర్ణిమకు ముస్తాబైన ఆలయాలు



హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని షిర్డీసాయి

బొమ్మనహళ్ళి, జూలై8(ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని పలు ఆల యాలు ముస్తాబయ్యాయి. అరికెరె శాంతినికేతన్ లేవుట్‌లో వెలసిన శాంతిధామ ముస్తాబవుతోంది. షిర్డీసాయి బాబా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, హారతులు ఉంటా యని ఆలయ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కాగడ హారతితో ప్రారంభమై రాత్రి శేజ్ హారతితో నిర్విరామంగా పలుధార్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ ట్రస్టు చైర్మన్ మేడా రామకృష్ణ తెలిపారు. ఈ సంవత్సరం 30వేల మంది దర్శించుకునే అవకాశం ఉంద న్నారు. అందుకు తగ్గట్టుగా భక్తులకోసం క్యూ లైన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 16వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అంగరంగ తీర్చిదిద్దారు. ఉదయంనుంచే ప్రసాదం పంపిణీ ఉంటుందన్నారు. భక్తులకోసం లడ్డూలను సిద్ధం చేసినట్టు తెలిపారు. నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించేలా చర్యలు చేపట్టామన్నారు. అన్నదానం భారీగా చేపడు తున్నందున దాతలు కూడా ఉదారంగా స్పందించారన్నారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్టు కార్యదర్శి తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, టీజీవీ గుప్త, సత్యనారాయణశెట్టి సహా సేవాదళ్ సభ్యులు మధుమతి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

కాగా హెచ్ఎస్ఆర్ లే అవుట్ కూల్‌జాయింట్ సర్కిల్‌లోని సాయిబాబా మందిరంలోని గురుపూర్ణిమ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 5 గంటలనుంచే భక్తులకు దర్శన అవకాశం ఉండేలా చర్యలు చేపట్టినట్టు షిర్డీసాయి సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. రాత్రి 10వరకు దర్శన అవకాశం ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. అన్నదానం కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



అరికెరెలో విద్యుద్దీపాలతో శాంతిధామ



సిద్ధమైన లడ్డూలతో సేవాదళ్ కార్యకర్తలు

వాల్మీకి విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలి: వీసీ



మాట్లాడుతున్న వీసీ శివానంద కెళగినమని

రాయచూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంబంధించి నిధుల పెంపు కోసం కేబినెట్ సబ్ కమిటీ పై ఒత్తిడి తెచ్చేందుకు తమవంతు ప్రయత్నం సాగిస్తున్నట్లు రాయచూరు మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం వీసీ శివానంద కెళగినమని తెలిపారు. విశ్వవిద్యాలయం వద్ద మంగళవారం విలేఖరులతో మాట్లాడిన వీసీ, 2020లో ప్రారంభమైన రాయచూరు మహర్షి వాల్మీకి విశ్వవిద్యాలయం 280 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో 20కి పైగా కోర్సులు ఉన్నాయన్నారు. దీంతో పాటు విశ్వ విద్యాలయం పరిధిలో 20 ప్రభుత్వం డిగ్రీ కళాశాలలు, 6 ఎయిడెడ్, 8 బీఈడీ కళాశాలలు, రెండు బీపీడీ కళాశాలలతో పాటు 148 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మొత్తం 184 కాలేజ్‌లు ఈ విశ్వ విద్యాలయం పరిధిలో ఉన్నట్లు వివరించారు. ప్రభుత్వ పరంగా అందించే నిధులు తప్పా ఇతరత్ర మార్గాల ద్వార విశ్వ విద్యాలయానికి నిధులు అందే అవకాశమే లేకపోవడంతో కేబినెట్ సబ్ కమిటీ ముందు సమస్యను ప్రస్తావించనున్నామన్నారు.

బిల్లుల బకాయిలతో... ఆగిన లారీలు



బూదికోటె ఆహార గోడౌన్ వద్ద ఆగిన లారీలు

బంగారపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నభాగ్య పథకం కింద గోడౌన్‌లనుంచి చౌకధాన్య డిపోలకు బియ్యం, ఇతరత్రా ధాన్యం తరలించే లారీలకు సుమారు ఆరు నెలల బిల్లులు బకాయి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా లారీ యజమానుల సంఘం నిరవధిక బంద్‌కు పిలుపునివ్వడంతో తాలూకాలోని లారీలు కూడా మద్దతు ఇచ్చారు. ప్రస్తుత ఏడాది అన్నభాగ్యలో బియ్యంతోపాటు రాగులు కూడా ఇస్తుండడంతో సాంకేతిక సమస్యల కారణంగా 20 రోజులపాటు జూన్‌లో బియ్యం పంపిణీలో సమస్య తలెత్తింది. అయినా చౌకడిపో నిర్వాహకులు పదిరోజులపాటు రేషన్ పంపిణీ చేశారు. అయితే జూలైలో లారీలు బంద్‌కు పిలుపునివ్వడంతో గోడౌన్‌లనుంచి రేషన్ రవాణా కాలేదు. దీంతో ఎక్కడి లారీలు అక్కడే ఆగిపోయాయి. ఈనెలలో ఇప్పటికే ఒక వారం గడిచింది. ప్రభుత్వం స్పందించాలని రేషన్‌షాప్ డీలర్‌లు కోరుతున్నారు. తాలూకా లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రైల్వే వ్యాగన్లనుంచి ప్రభుత్వ ఆహార గోడౌన్‌లకు, అక్కడనుంచి తాలూకాలోని అన్ని చౌకడిపోలకు తరలించాల్సి ఉంటుందన్నారు. ప్రతిరోజూ డీజిల్ ధర పెరుగుతోందని, అయినా నెలనెలా బాధ్యతగా రవాణా చేశామన్నారు. అయితే ఆరు నెలలుగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణా సమస్య తలెత్తిందన్నారు.

ప్రతిభా పురస్కారాలకు

దరఖాస్తుల ఆహ్వానం

బెంగళూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ములకనాడు మహాసంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ సీఏ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ములకనాడు సముదాయానికి చెందిన సభ్యుల పిల్లలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. పదో తరగతిలో 85శాతం, పీయూసీలో 8.5 గ్రేడ్, డిగ్రీ, పీజీలలో 75శాతం మార్కులు పొందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. వివరాలకు 7204744338 సంప్రదించాలని తెలిపారు.

శ్వాసనాళ వ్యాధులపై అవగాహన పెరగాలి

బెంగళూరు, జూలై8(ఆంధ్రజ్యోతి): దేశంలో శ్వాసనాళ సంబంధిత సమస్యలకు కారణమయ్యే రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ)పై అవగాహనతోపాటు టీకాలు అవసరమని ఇండియన్ అకాడమీ ఆఫ్ పెడియాట్రిక్స్ జాతీయ అధ్యక్షుడు వసంత్ ఎం ఖలత్కర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం నగరంలో సనోఫి వైద్య అంతర్జాతీయ సంస్థ ముఖ్యులు డాక్టర్ సీజర్ మస్కర్నాస్, డాక్టర్ రెడ్డీస్ మెడికల్ అఫైర్స్ ముఖ్యులు భవేశ్ కోటక్‌లు మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు శ్వాసకోశకు సంబంధించి వైరస్ వేగవంతంగా ప్రబలుతుందన్నారు. దేశంలో 36 లక్షలమంది చిన్నారులు ఏటా ఆసుపత్రి పాలవుతున్నారని, లక్షమంది చిన్నారులు మృత్యువాత చెందుతున్నారన్నారు. 25లక్షల నవజాత శిశువులు జననం కల్గిన దేశంలో నిమోనియా తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. సాధారణంగా వర్షాకాలం ప్రాంభంతోపాటు చలికాలంలో ఈ పరిణామం తీవ్రంగా ఉంటుందన్నారు. ఐసీయూ, ఆక్సిజన్ వెంటిలేటర్ వంటి చికిత్సలు అవసరం కానున్నాయన్నారు. ప్రత్యేకమైన టీకాలు సకాలంలో అందిస్తే వైరస్ నుంచి కొంతమేర అరికట్టవచ్చునన్నారు. ఆర్ఎస్‌వీ నియంత్రణకు ప్రజలలో అవగాహన, సకాలంలో అనుభవజ్ఞులైన వైద్యుల చికిత్సలు అవసరమన్నారు. సనోఫి, రెడ్డీస్‌ల్యాబ్ సంయుక్తంగా కార్యాచరణ చేస్తున్నట్టు ప్రకటించారు.

సవితా సహాయకూట ద్వారా విస్తృత సేవలు



సుమా గస్తికి సన్మానం

బెంగళూరు, జూలై8 (ఆంధ్రజ్యోతి): సవితా సహాయ కూట ద్వారా సమాజానికి చెందిన ప్రజలకోసం విస్తృత సేవలందించేలా తీర్మానించారు. కడబగెరెలోని కిరణ్ నర్సింగ్ కాలేజ్‌లో సమావేశం జరిగింది. రాష్ట్రస్థాయిలో ఉద్యోగమేళా, వధూవరుల పరిచయ వేదికతోపాటు ఇతరత్రా కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని తీర్మానించారు. అఖిల భారత మహా పద్మానంద సముదాయ విద్యావంతుల సంఘం, రాష్ట్ర సవితా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, క్షేమాభివృద్ధి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విష్ణుకాంత్ చట్‌పల్లిని సత్కరించారు. కార్య క్రమంలో సుమా గస్తి, గోవిందమ్మ, మంజునాథ్, రాజణ్ణ, వెంకటరమణ, రవీంద్ర బాబు, కోదండరామ, మల్లికార్జున గోవితోపాటు పలువురు పాల్గొన్నారు.

గర్భిణికి చికిత్స విజయవంతం

బెంగళూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలు ఎదుర్కొంటున్న గర్భిణికి చికిత్సను వాసవి ఆసుపత్రి డాక్టర్ నిశా బుచాడ విజయవంతం చేశారు. ప్లాసెంటా పర్‌క్రియేటా సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. 28వారాల వేళ మహిళ తీవ్ర రక్తహీనత సమస్యతోపాటు గర్భస్థ శిశువు కూడా తగినంత బరువులేదని గుర్తించారు. ఇందుకు తగిన చికిత్సలు ఇవ్వడంతో 36వారాలకు చేరుకున్నాక జెస్టేషనల్ డయాబెటీస్ ఉన్నట్టు తేలింది. ఇన్సులిన్ ద్వారా నియంత్రించారు. సిజేరియన్ ద్వారా తల్లీబిడ్డలను కాపాడినట్టు ప్రకటనలో తెలిపారు.

విద్యతోపాటు సంస్కారం నేర్పాలి: ఎస్ఐ




ప్రసంగిస్తున్న ఎస్ఐ సతీశ్

శిడ్లఘట్ట, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు గురువులు, సీనియర్లను గౌరవించి సంస్కారం నేర్పించాలని పట్టుదలతో ఏదైనా సాధించవచ్చునని రూరల్ ఎస్ఐ సతీశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని దిబ్బూరహళ్ళి బైపాస్ రోడ్డులోని జ్ఞానజ్యోతి ఐటీఐ కళాశాలలో ఏర్పాటైన ద్వితీయ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మంచి లక్ష్యంతో ఏదైనా సాధించవచ్చునన్నారు. ఐటీఐ అంటే గుర్తుకొచ్చేది నట్టు, బోల్ట్, విద్యుత్‌వైర్లు, ఇతర వస్తువులన్నారు. సాంకేతిక విద్య, ఉద్యోగంలో విజయం సాధించేలా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదే సందర్భంగా వివిధ క్రీడాపోటీల విజేతలను సత్కరించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ సునీత, బెస్కాం జేఈ నాగేశ్, రిటైర్డు అధికారి విజయ్‌కుమార్, కర్ణాటక సాహిత్య అకాడమీ చకోర సాహిత్య విచార వేదిక జిల్లా సంచాలకులు ఈధరె ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

యరగేరాను తాలూకాగా ప్రకటించాలని 22న ధర్నా

రాయచూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీ యరగేరాను తాలూకా కేంద్రంగా మార్చాలన్న డిమాండ్‌తో ఈ నెల 22న బెంగళూరులో నిరవధిక ధర్నా నిర్వహిస్తామని పోరాట సమితి నాయకుడు నిజాముద్దీన్ తెలిపారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దాదాపు 80కి పైగా గ్రామాలకు అత్యంత అనుకూలంగా ఉండే యరగేరాను తాలూకా కేంద్రంగా మార్చాలంటు 2020 నుంచి తాము పోరాటం చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఇటీవల యరగేరా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యచ, మంత్రులను కలిసి తాము విన్నవించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. ఇదే డిమాండ్‌తో తాము ఈనెల 22న బెంగళూరులో ప్రత్యేక ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.83	1,599.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	52,423	30.388
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	61,145	156
నీటి నిల్వ (టీఎంసీలు)	75.93	20.85

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

● తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో నిఘా పెంచాలి ● జిల్లా విపత్తు నిర్వహణ సమావేశంలో కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి నదిలోకి నీటిని విడుదల చేశామని, వరద నిర్వహణకు అవసరమైన సన్నాహాలు చేయాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ చైర్మన్, జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వన్ వీడియో ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసారి మల్నాడు ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర ఆనకట్ట జలాశయం గడువు కంటే ముందే నిండిపోయిందని, ఈసారి 80 నుంచి 85 టీఎంసీల వరకే నీటిని నిల్వ ఉంచుకోవాలని జలనిపుణులు సూచించారన్నారు. అందుకే అదనపు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. వరదలకు గురయ్యే అవకాశం ఉన్న నదీగర్భంలోని గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కంప్లి, సిరుగుప్ప తాలూకాల తహశీల్దార్లను ఆదేశించారు. వరదలకు సంబంధించి ఆయా తాలూకా తహశీల్దార్లు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. నదీ పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు నదిలోకి దిగవద్దని హెచ్చరించాలి, ప్రజలు, పశువులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రాణనష్టం, పంట నష్టం జరగకుండా సంబంధిత తహశీల్దార్లు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు.

వ్యవసాయ సంయుక్త సంచాలకులు సోమసుందర్ మాట్లాడుతూ జూలై నెలలో జిల్లాలో 9.6 శాతం వర్షపాతం నమోదైందని. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాల్లో ఇప్పటికే పత్తి, జొన్న, కంది పంటలు విత్తడానికి అవకాశం ఉందన్నారు.

జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ అధికారి పరమేశ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తుంగభద్ర జలాశయం 76,731 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఇన్‌ఫ్లో 54,550 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 61,645 క్యూసెక్కులుగా ఉందన్నారు. రిజర్వాయర్ నుంచి నదిలోకి లక్ష క్యూసెక్కుల కంటే ఎక్కువ నీటిని విడుదల చేసినప్పుటడు మాత్రమే కంప్లి, గంగావతి వంతెనలు మునిగిపోతాయన్నారు. కంప్లి ప్రాంతంలోని రెండు గ్రామాలు, సిరుగుప్ప ప్రాంతంలోని ఓ గ్రామం ముంపునకు గురవుతాయన్నారు. భద్రత కోసం ఇప్పటికే సంరక్షణ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలియజేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ విపత్తు నిర్వహణ నిధి కింద జిల్లాలో చేపట్టిన పనులపై చర్చించి సంబంధిత అధికారుల నుండి సమాచారాన్ని పొందారు.

ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్, డీడీఎల్ఆర్ ప్రమోద్, ప్రజాపనుల శాఖ, పశుసంవర్ధక, ఉద్యానవనశాఖ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ఐదు తాలూకాల తహసీల్దార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



మాట్లాడుతున్న కమిషనర్ జుబిన్ మహాపాత్ర

వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు: కమిషనర్

రాయచూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకూ పెరిగి పోతున్న వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను రక్షించేందుకు 9వ తేదీ బుధవారం నుంచి ప్రత్యేక కార్యచరణ చేపట్టనున్నట్లు రాయచూరు మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మహాపాత్ర తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడిన కమిషనర్ వీధి కుక్కలు, పిచ్చి కుక్కలను నియంత్రించేందుకు మూడుదశల కార్యాచరణ చేపట్టామన్నారు. తొలుత ఈ కార్యచరణను నిబంధనల మేరకు పశుసంవర్ధక శాఖ, మహానగర పాలికతో పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. కుక్కల సంతానం పెరగకుండా వాటికి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఒప్పందం చేసుకుని నిపుణులైన డాక్టర్ పర్యవేక్షణలో వాటిని కొనసాగిస్తామన్నారు. దీంతో పాటు వీధి కుక్కల దాడి ఎక్కడ జరిగినా వెంటనే హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని అరగంటలోగానే ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లి కుక్కల నియంత్రణ చేపడుతాయన్నారు. నగరంలో ఇటీవల విడి పశువుల సంచారం పెరిగిపోవడం వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు కఠిణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే 70 పశువులను స్వాధీనం చేసుకున్నామని కార్యచరణను ఎదావిధిగా కొనసాగిస్తామన్నారు.

వీధికుక్కల బెడదపై ఎస్‌డీపీఐ ఆందోళన

నగరంలో వీధి కుక్కల దాడి పెరిగి ప్రజలు గాయాలు పడుతున్న నేపథ్యంలో ఎస్‌డీపీఐ నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత జిల్లాధికారి కార్యాలయం ఎదుట పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలు మహానగర పాలిక తీరుకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. వీధి కుక్కల బారిన పడి చిన్నారులు, మహిళలు గాయాలు పడుతున్నా రెండు నెలల క్రితం యువతి ఒకరు మృత్యువాత పడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. బాధితులు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తెచ్చినా ఇప్పటి వరకు స్పందించడం లేదని ఆరోపిస్తు అధికారుల తీరు పై తీవ్ర ఆగ్రహం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు మేల్కొని విధికుక్కలను నియంత్రించాలని డిమాండ్ చేస్తు కమిషనర్ జుబిన్ మహాపాత్రకు వినతి పత్రం అందజేశారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

దృష్టిలోపం ఉన్నవారికి ఆశాకిరణం

● సద్వినియోగం చేసుకోవాలి: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): కంటిసమస్యలు ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు జిల్లా ఆరోగ్య కేంద్రాల దృష్టి కేంద్రాలను సందర్శించి వారి కళ్లకు చికిత్స చేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి(డీహెచ్ఓ) రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని విజన్ సెంటర్‌ను సందర్శించి కంటి పరీక్షలు అద్దాలు పొందిన ప్రజలను ఉద్దేశించి ఆమన మాట్లాడారు. గత గురువారం ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య సంక్షేమ మంత్రి ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించారని, దృష్టిలోపం ఉన్నవారికి ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ, కంటిశుక్లం శస్త్రచికిత్స సౌకర్యాలను అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో బళ్లారి జిల్లా ఆసుపత్రి సండూర్, సిరుగుప్ప పబ్లిక్ హాస్పిటల్ , మోకా, రూపనగుడి, కంప్లి, కురుగోడు ,తెక్కలకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో విజన్ సెంటర్లు ప్రారంభించామన్నారు. ప్రజలు కంటి పరీక్షల కోసం నగరాలకు వచ్చి డబ్బు ఖర్చు చేయకుండా అందరికీ అందుబాటులో ఉండేలా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంలో మోకా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భారతి, డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ అంజూమ్ మున్నీసా, జిల్లా ఆరోగ్య విద్యా అధికారి ఈశ్వర్ దాసప్పనవర్, విజన్‌సెంటర్ ఆప్తమాలజిస్ట్ మంజునాథ్ సిబ్బంది వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌ను తొలగించాలి

● సంచార జాతి సంఘాల డిమాండ్



నిరసన తెలుపుతున్న సంచార జాతుల నాయకులు

బళ్లారి సిటీ,జూలై 8(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ మాజీ మంత్రి వెనుకబడిన వర్గాల నాయకుడు అంజనేయ సంచార జాతుల హోదా కోసం పోరాడుతున్నారు. బెంగళూరు నగరంలో 49షెడ్యూల్డ్ కులాల సంచార జాతుల నాయకుల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో కొరచ, కొరవ వర్గాల నాయకురాలు పల్లవి సమావేశానికి వచ్చి గందరగోళం సృష్టించి గొడవ సృష్టించి కొంతమంది సంచార జాతుల నాయకులపై కేసు నమోదు చేశారని బళ్లారి జిల్లాసంచార జాతుల నాయకుడు మహేశ్ మండిపడ్డారు. మంగళవారం వారు నగరంలో చైర్మన్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లవి చేసిన అవమానం సంచార జాతుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందన్నారు. వారు తమ సమాజం గురించి ఆందోళన చెందుతుంటే వారు ప్రత్యేక కార్పొరేషన్ కోసం పోరాడాలి. అది పక్కన పెట్టి సంచార జాతుల నాయకులు కాంగ్రెస్ పార్టీనాయకులు, సంచార సంఘం అధ్యక్షుడు శివకుమార్ మరో ఆరుగురిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. గతంలో సంచారజాతుల నాయకులు ఒక చిన్న సమాజం వారు సంస్థాగతంగా చాలా వెనుకబడి ఉన్నారు. అటువంటి సమాజం యొక్క పోరాటానికి మద్దతు ఇచ్చిన ఆంజనేయ అభినందనీ యుడన్నారు. ఫిర్యాదును వారు ఉపసంహరించుకోకపోతే సంచార జాతుల సమాజం రాష్ట్రవ్యాప్త నిరసన చేపడ్తామన్నారు. పల్లవిని తొలగించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు జిల్లా కలెక్టర్ ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంచార సంఘం నాయకులు నాగరాజ్, దుర్గేశ్, నాగలింగ, సత్యప్ప, లింగప్ప, రమేశ్, మంజునాథ్ , భరత్, హుచ్చప్ప, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా అందని వేతనాలు

● ఉపాధి ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి పథకం సిబ్బంది

కంప్లి, జూలై8(ఆంధ్రజ్యోతి): తాలుకా పంచాయతీలో నరేగా పథకం కింద కాంట్రాక్ట్ బేసిక్ పైన విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సక్రమంగా వేతనాలివ్వాలని కర్ణాటక రాష్ట్ర మహాత్మాగాంధీ నరేగా నౌకరుల క్షమాభివృద్ధి సంఘటన కార్యదర్శి హనుమేష్ కోరారు. మంగళవారం కంప్లి పట్టణంలో తాలుకా పంచాయతీ ప్రాంగణంలో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా హనుమేష్ మాట్లాడుతూ తాలుకా స్థాయిలో ఎంఐఎస్ఐఇసీ సివిల్ కృషి తోటకి అరణ్య రేష్మ, వివిధ భాగాల అధికారుల ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో వేతనాల కోసం నిరసన చేపడుతున్నారు. ఆరు నెలల వేతనాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఇళ్లకు పరిమితమయ్యారన్నారు. ఇళ్లు గడిచేందుకే కష్టంగా మారిందని వాపోయారు. పగలు రాత్రులు అన్న తేడా లేకుండా విధులు నిర్వహించాము. వేతనాలు ఇవ్వడంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం చూపుతున్నాయని వాపోయారు. చిరు జీతాలతో ఇళ్లు గడవడమే కష్టమని, అలాంటి పరిస్థితుల్లో ఆరు నెలలుగా జీతాలు రాకపోతే ఎలా బతకాలన్నారు. ఇప్పటికైనా తమ చేస్తున్న విధుల్ని గుర్తుంచుకుని తమకు వేతనాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేష్, తిప్పేష్, లోకేష్, అంజనప్ప, శిల్ప, శేఖర్, రజిని, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లోకాయుక్త ఫిర్యాదుల స్వీకరణ

హోస్పేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రదేశాలలో లోకాయుక్త ప్రజా సంబంధాల సమావేశం నిర్వహించనున్నారు. లోకాయుక్త డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కర్ణాటక లోకాయుక్త హోస్పేట్ యూనిట్ నుంచి పోలీస్ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో బుధవారం నుంచి లోకాయుక్త ప్రజా సంబంధాల సమావేశాలు జరగనున్నాయని కర్ణాటక లోకాయుక్త హోస్పేట్ యూనిట్ డీఎస్పీ సచిన్ ఎస్ చలవాడి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న హరపనహళ్లి తాలూక్ ఆఫీస్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 15న కొత్తూర్ తాలూక్ ఆఫీస్ హాల్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 30న కూడ్లికి తాలూకా ఆఫీస్ హాల్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసంబంధాల సమావేశాలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది వేధింపులు, ఇబ్బందులు, దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదులు, అభ్యర్థనలను, దఖాస్తులను అందజేసి న్యాయం పొందవచ్చని తెలిపారు.

అదనపు తరగతి గది నిర్మించాలి: కేఆర్ఎస్



విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కేఆర్ఎస్ సభ్యులు

సిరుగుప్ప, జూలై8(ఆంధ్రజ్యోతి): అదనపు తరగతి గది నిర్మాణ పనులు చేపట్టాలని కేఆర్ఎస్ కార్యకర్తలు విద్యాశాఖ అధికారులను కోరారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో కేఆర్ఎస్ కార్యకర్తలు విద్యాశాఖాధికారి గుర్రప్పను కలిశారు. టెక్కలకోట పట్టణంలో తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంతకుముందున్న తరగతి గది శిథిలావస్థకు చేరుకుందని, తక్షణమే అదనపు గది నిర్మాణం చేపట్టాలని తెలిపారు. విద్యాశాఖాధికారి గుర్రప్ప ఈ విషయంపై తక్షణమే అధికారులకు తెలియజేసి గది నిర్మాణాలు చేపడ్తామన్నారు.

అగ్నిగుండంలో పడి తీవ్రగాయాలు

గోరంట్ల, జూలై8 (ఆంధ్రజ్యోతి): పీర్లచావిడి వద్ద అల్లావు తొక్కుతూ సెల్ఫీ తీసుకునేయత్నంలో యువకుడు అగ్నిగుండంలో పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని పాలసముద్రం బీసీ కాలనీకి చెందిన ఆనంద్‌కుమార్ సోమవారం రాత్రి అల్లావు తొక్కుతూ సెల్ఫీతీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అగ్నిగుండలో పడ్డాడు. స్థానికులు ప్రైవేటు వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

మంత్రి శివరాజ్ తంగడిగె రాజీనామా చేయాలి

● మఠాలకు నిధులల్లోనూ కమీషన్ల కక్కుర్తి ● మితిమీరుతున్న మంత్రి అనుచరుల ఆగడాలు: ఎమ్మెల్సీ వైఎం సతీష్

బళ్లారిరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): మఠాలకు మంజూరైన నిధులు విడుదల చేసేందుకు 20 నుంచి 25 శాతం కమీషన్ డిమాండ్ చేసిన మంత్రి శివరాజ్ తంగడిగె పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ వైఎం సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి తదితర బీజేపీ నాయకులతో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ 2022లో నాగప్రసన్న, విశ్వ గాంధీగల్ రాష్ట్ర అభివృద్ధికి ఆనాటి సీఎం బసవరాజు బొమ్మై, రూ.మూడున్నర కోట్లు మంజూరు చేయగా అందులో రూ.2 కోట్లు ఆనాడు విడుదల కాగా మిగిలిన రూ. కోటిన్నర బకాయి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వాటిని విడుదల చేయాలని మార్చిలో కోర్టును ఆశ్రయించగా నెలలోగా మొత్తాన్ని ఇవ్వాలని ఆదేశించిందని, ఆలస్యమైతే ఆరుశాతం ఫైన్‌తో చెల్లించాలని కూడా ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయకుండా సాగదీస్తూ వస్తున్నారని, ఇందులో 25 శాతం కమీషన్ ఇస్తేనే నిధులు మంజూరు చేస్తామని మంత్రి సహచరులు అనడం అన్యాయమన్నారు. మఠం నిధులపైనా కమీషన్ అడుగుతున్న కక్కుర్తి కాంగ్రెస్ నాయకులకే దక్కిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి రూ. కోటిన్నర సర్కిల్ వద్ద గల శ్రీరామ మందిరం కోసం రూ. 50 లక్షలు ఆనాడు మంజూరు చేశారని అయితే అప్పటివరకు సగం మొత్తం మాత్రమే విడుదల చేసి మిగిలిన మొత్తం విడుదలలో కాలయాపన చేస్తున్నారన్నారు. అయితే ఇటీవల ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి దేవస్థానం కోసం రూ. ఐదు కోట్లు నిధులు సమర్పించినట్లు చెబుతున్నారని అయితే, ఆ నిధులు ఏయే దేవస్థానాలకు ఇచ్చారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, బీజేపీ ప్రముఖులు దివాకర్, ఓబుళేసు, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైఎం సతీష్

బీజేపీ నగర అధ్యక్షుడిగా గుర్రం



బీజేపీ బళ్లారి నగర నూతన అధ్యక్షుడిగా మాజీ మేయర్ గుర్రం వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ నేత వరుణ్ షాపూర్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో వెంకటరమణ మాత్రమే నామినేషన్ సమర్పించడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. పలువురు నాయకులు ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు.

హోసూరు జోన్



రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్తదిబ్బను తొలగించరూ..!

హోసూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): హోసూరులోని గోకుల్‌నగర్ ప్రాంతంలో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏపీటీ నగర్, ఎన్‌పీ అగ్రహార, కరపల్లి, ఒన్నల్‌వాడి తదితర ప్రాంతాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం నెలకొందని, దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి ఉంటోందని పలువురు వాపోతున్నారు.

నేడు భూ రికార్డుల మ్యుటేషన్

● తహసీల్దార్ గౌసియా బేగం



సిరుగుప్ప, జూలై8(ఆంధ్రజ్యోతి): టెక్కలకోట పట్టణ పరిధిలోని గ్రామాలకు సంబంధించి ల్యాండ్ రికార్డుల మ్యుటేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గౌసియా బేగం తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడిన ఆమె టెక్కలకోట పరిధిలో అరిగనూరు, నడివి, నిట్టూరు, కొప్పనాళ్ గ్రామాలకు సంబంధించి ల్యాండ్ రికార్డుల కోసం తానే మ్యుటేషన్లు ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు వంశవృక్షం, పహణీ తదితర రికార్డులతో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.



శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు, సిబ్బంది

అటవీ అధికారులకు ముగిసిన శిక్షణ

హోసూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): హోసూరు ఫారెస్ట్ రిజర్వ్‌లో కొత్తగా చేరిన వివిధ అటవీశాఖ అధికారులకు ఇచ్చిన తర్ఫీదు ముగిసింది. హోసూరు ఫారెస్ట్ రిజర్వుకు 71మంది అధికారులను కేటాయించారు. ఫారెస్టు గార్డులు, రేంజర్‌లు, డ్రైవర్‌లకు శిక్షణ ఇచ్చారు. జూన్ 5న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అటవీ కార్యాలయంలో వన్యప్రాణుల సంరక్షణ, మానవ-వన్యప్రాణుల సంఘర్షణ నిర్వహించడంపై శిక్షణ ఇచ్చారు. హోసూరు ఫారెస్ట్ రిజర్వు వార్డెన్ పఖాన్, జగదీశ్, సుధాకర్‌లు కొత్త సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చారు. అసిస్టెంట్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశ్వంత్ జగదీశ్ అంబుల్కర్, రాజమారియప్పన్, అటవీ శాఖ రేంజ్ అధికారులు, అటవీ జీవశాస్త్రవేత్తలు, అటవీ నిల్వలు, అటవీ శ్రేణులు, క్షేత్రంలో నిర్వహించాల్సిన పనులపై అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఎన్జీఓ సభ్యులు కెన్నెత్ అండర్సన్ నేచర్ సొసైటీ, హోసూరు, అరోచా ఇండియా బెంగళూరు పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో యువకుడికి గాయాలు

హోసూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పొలం వద్దకు వెళ్లిన సమయంలో డెంకణీకోట సమీపంలోని కాడులక్కసంద్రం గ్రామానికి చెందిన నాగరాజ్ కొడుకు మాదేశ్ (26) ఏనుగు దాడిలో గాయపడ్డాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లినవేళ పొదలనుంచి వచ్చిన ఒంటరి ఏనుగు అకస్మాత్తుగా దాడి చేసింది. మాదేశ్ కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు వచ్చి శబ్దాలు చేశారు. దీంతో ఏనుగు అక్కడనుంచి వెళ్లిపోయింది. స్థానికులు మాదేశ్‌ను డెంకణీకోట ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి మార్పు చేశారు. డెంకణీకోట అటవీశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.



గాయపడిన యువకుడు

ఉపాధి ఆధారిత పథకాన్ని

సద్వినియోగం చేసుకోండి

భవిష్యనిధి కమిషనర్ కేవీ ప్రవీణ్



మాట్లాడుతున్న భవిష్యనిధి కమిషనర్

బళ్లారి సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్ని తయారీ రంగాల్లో ఉద్యోగాలను సృష్టించడం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్న ఉపాధి ఆధారిత ప్రొత్సాహక(ఈఎల్ఐ) పథకాన్ని కేంద్ర కార్మిక ,ఉపాధి మంత్రిత్వ శాఖ ఆమోదించిందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) బళ్లారి ప్రాంతీయ కార్యాలయం కమిషనర్ కేవీ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం బళ్లారి ప్రాంతీయ కార్యాలయ హాల్లో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఇపీఎఫ్ఓ)ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) బళ్లారి ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని బళ్లారి, విజయనగరం, చిత్రదుర్గ, కొప్పళ సహా నాలుగు జిల్లాల్లో పనిచేస్తున్న పారిశ్రామికరంగం, ఇతర రంగాలవారు నమోదు చేసుకోవచ్చన్నారు. ఉద్యోగులు, యజమానులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకంలో భాగంగా కొత్తగా ఉపాధి పొందుతున్న వ్యక్తులు, కొత్తఉద్యోగాలను సృష్టించే యజమానులు కేంద్రప్రభుత్వ ప్రోత్సాహకాల నుంచి ప్రయోజనం పొందుతారన్నారు. ఈపథకాన్ని 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. యువతకు ఉపాధి,నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకతకు మద్దతు ఇవ్వడానికి దీనిని అమలు చేశారన్నారు. ఈపథకం ప్రయోజనం ఆగస్టు 1న 2025, జూలై 31, 2027 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈపీఎఫ్ఓ కార్యాలయం ఇప్పటికే ప్రతినెలా నిర్వహిస్తున్న నిధి ఆప్కే కార్యక్రమంలో ఈపథకం గురించి అవగాహన కల్పిస్తామని, తాలూకా స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈపథకం కింద మొదటిసారి ఉద్యోగంలో చేరిన వారికి రెండు విడతలుగా నెలకు రూ.15వేలు వరకు జీతం అందజేస్తామని, కొత్త ఉద్యోగి నియామకం కోసం యజమానులకు రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3వేల వరకు ప్రోత్సాహకం ఇస్తామని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) బళ్లారి ప్రాంతీయ కార్యాలయం ఆర్థిక నిర్వాహకుడు కే.ఎస్.వేణుగోపాల్ తెలిపారు. ఈపథకం రెండు భాగాలను కలిగి ఉంటుందని పార్ట్-ఏ మొదటిసారి పనిచేసే కార్మికులపై దృష్టిపెడుతుందని,పార్ట్ -బి యజమానులపై దృష్టిపెడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లాఉద్యోగుల భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ కమిషనర్ నందన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.